ఏడాదిలోనే కూటమిపై ప్రజా వ్యతిరేకత

- అబద్ధపు హామీలతో మోసం చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణు



క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి వేణు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: అధికారంలోకి చేపట్టిన ఏడాదిలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ఏర్పడిందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం పార్టీ రూరల్ నియోజక వర్గ విస్తృతస్థాయి సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. వేణు మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ అనేక అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. ఎన్నికలకు ముందు 'బాబు ష్యూరిటీ – భవిష్యత్తు గ్యారెంటీ' అని మాట ఇచ్చి.. నేడు 'బాబు ష్యూ రిటీ – మోసం గ్యారెంటీ' అనేలా మారారన్నారు. ఈ సందర్భంగా 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో, బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' పేరుతో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. మాజీ మంత్రి వేణు మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో 143 హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక అమలు చేయలేదన్నారు. వాటిని ప్రజలకు వైఎస్సార్ సీపీ శ్రేణులు వివరించాలన్నారు. రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అక్రమ సంపాదనకు హద్దే లేకుండా పోతోందన్నారు.

చంద్రబాబు అంటే మోసం

పార్టీ రాజమండ్రి పార్లమెంటు ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ జగనన్న అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం అని తేలిపోయిందన్నారు. మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు మాట్లాడుతూ చంద్రబాబు మోసాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి ఎండగడదామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పార్టీ కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రతి ఇంటింటినీ మోసం చేశారన్నారు. ప్రముఖ న్యాయవాది, కొవ్వూరు నియోజకవర్గ పరిశీలకులు గొందేశి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ పేరుతో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ మోసాలను వివరిద్దామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల విష్ణుచక్రవర్తి, పార్టీ రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ అంగాడి సత్యప్రియ, జిల్లా అధికార ప్రతినిధి పెయ్యల రాజేష్, జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు ఎం.విజయసారథి, నియోజకవర్గ వివిధ విభాగాల అధ్యక్షులు పడాల వీర రాఘవరెడ్డి, ఆచంట కళ్యాణ్, చీకురుమిల్లి చిన్న, బత్తిన అప్పారావు, బిల్డర్ చిన్న, తాతపూడి రాంబాబు, టేకి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు అత్తిలి భీమశంకరం, దాసరి శేషగిరి, సాపిరెడ్డి సూరిబాబు, జిల్లా కార్యదర్శి యెనుముల త్యాగరాజు, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులు

క్లుప్తంగా

ముస్లింలకు చంద్రబాబు ద్రోహం



సజ్జల రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న ఆరిఫ్

సీటీఆర్ఐ: వివాదాస్పద వక్ఫ్ బిల్లుకు మద్దతు ఇచ్చి రాష్ట్రంలోని మైనార్టీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ విధంగా ద్రోహం చేశారో ముస్లింలందరికీ వివరించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్, మాజీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపు నిచ్చారని వక్ఫ్ బోర్డ్ జిల్లా మాజీ చైర్మన్, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మహమ్మద్ ఆరిఫ్ అన్నారు. అలాగే వక్ఫ్ బిల్లును పార్లమెంట్ ఉభయ సభల్లో వ్యతిరేకించిన మాజీ సీఎం జగన్.. ముస్లింలకు చేసిన మేలును కూడా ప్రజలకు తెలియజేయాలన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన రాష్ట్ర మైనార్టీ సెల్ విస్తృత స్థాయి సమావేశంలో ఆరిఫ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు.

కిక్ బాక్సింగ్‌లో సత్తా

ప్రకాశం నగర్: ఇటీవల విశాఖపట్నంలో జరిగిన థర్డ్ ఏపీ స్టేట్ ప్రో ఓపెన్ కిక్ బాక్సింగ్ పోటీల్లో 78 కేజీల పురుషుల విభాగంలో తమ కళాశాల విద్యార్థి జి.అశిక్ రాజ్ స్టేట్ ప్రో చాంపియన్ షిప్ 2025 బెల్ట్ టైటిల్ సాధించినట్లు ఎస్‌కేవీటీ కళాశాల ప్రిన్సిపాల్ బీబీ తిరుపాణ్యం తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. అశిక్ రాజ్‌కు కళాశాల పూర్వ విద్యార్థి, బాక్సింగ్ గోల్డ్ మెడల్ విజేత భవానీ శంకర్ కోచ్‌గా వ్యవహరించారన్నారు.

ప్రమాదకరంగా గుంత



రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గుంత

సీటీఆర్ఐ: స్థానిక రాజా థియేటర్ నుంచి క్వారీ మార్కెట్‌కు వెళ్లే దారిలో నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. సుమారు అడుగు లోతు గుంత ఏర్పడటంతో వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. క్వారీ మార్కెట్, వాంబే గృహాలు, పీఅండ్‌టీ కాలనీకి చాలామంది ఎక్కువగా ఈ దారిలో ప్రయాణిస్తారు. వర్షం కురిసినప్పుడు దీనిలో నీరు చేరడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలాగే ఆదివారం మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తి అదుపు తప్పి గుంతలో పడిపోయాడు. వెనుక నుంచి వస్తున్న ఆటో అతడి కాలుపై ఎక్కడంతో స్థానికులు వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

పోలీసు సిబ్బందికి సత్కారం



ఉద్యోగ విరమణ చేసిన పోలీసు సిబ్బందిని సత్కరిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు: జిల్లా పోలీసు విభాగంలో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందిని సోమవారం స్థానిక పోలీసు కార్యాలయంలో ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో వారు అందించిన సేవలను కొనియాడారు. విశ్రాంత జీవితం సంతోషంగా గడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎంబీఎస్ మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, ఎల్.అర్జున్, ఎల్.చెంచిరెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్, ఏ.శ్రీనివాసరావు, జోనల్ డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

కంబాలచెరువు: ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో పర్యటించనున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను సోమవారం ఎస్పీ డి.నరసింహ కిశోర్ పరిశీలించారు. దీనిలో భాగంగా అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైయిజన్ (బందోబస్తు ప్రక్రియ) నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రదేశాలలో బందోబస్తు పటిష్టంగా ఉండేలా, ఆయన తిరుగు ప్రయాణం అయ్యే వరకూ గట్టి భద్రత కల్పించాలని అధికారులను అప్రమత్తం చేశారు. భద్రతా చర్యలపై జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు.

సమస్యలపై 19 అర్జీలు

సీటీఆర్ఐ: స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 19 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ మాట్లాడుతూ నిర్ణీత గడువు లోగా అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సోమవారం వచ్చిన అర్జీలు శనివారం నాటికల్లా క్లోజ్ అయ్యేలా ఆయా విభాగాల హెచ్ఓడీలు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికకు ఓటరు జాబితా ప్రకటన



కడియపులంకలో ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న సచివాలయ సిబ్బంది

కడియం: కడియపులంక సర్పంచ్ ఉప ఎన్నికలకు సంబంధించి ఓటరు జబితాను ప్రకటించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎంపీడీవో కె.రమేష్ ఈ జాబితాను కడియపులంక పంచాయతీ కార్యాలయం, సచివాలయాల వద్ద ప్రదర్శనకు ఉంచారు. ఆ గ్రామ సర్పంచ్ మార్గాని అమ్మాణీ అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. అయితే 2026 ఏప్రిల్ నాటికి సర్పంచ్‌ల పదవీ కాలం ముగుస్తుంది. పది నెలల కాలపరిమితి మాత్రమే ఉన్నందున ఈ ఎన్నికలకు జరుగుతాయా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

సచివాలయాల్లో నీటి పన్ను చెల్లించాలి

పెదపూడి: నీటి పన్నును గ్రామ సచివాలయాల్లో చెల్లించేలా సాంకేతిక వ్యవస్థను తీసుకురావడం జరిగిందని, రైతులు వెంటనే నీటి పన్నును చెల్లించాలని తహసీల్దార్ పీవీ సీతాపతిరావు అన్నారు. ఆయన సోమవారం పెదపూడిలో మాట్లాడుతూ రైతులు గ్రామ రెవెన్యూ అధికారుల ద్వారా డిమాండ్ నోటీసులు పొంది, వెంటనే నీటి పన్నును చెల్లించాలన్నారు. ప్రభుత్వం సాంకేతిక కారణాలను తొలగించి 2020 సంవత్సరానికి ముందు ఉన్న బకాయిలు నిర్ధారించి 2024 సంవత్సరం వరకు 1430 పసలీ నుంచి 1434 పసలీ వరకు నీటి పన్నును రైతులు చెల్లించాల్సి ఉందన్నారు. సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్‌కు పన్ను చెల్లించాలన్నారు.

ఓఎన్జీసీలో కాంట్రాక్టు డ్రైవర్లకు శ్రమ దోపిడీ

రాజమహేంద్రవరం రూరల్: ఓఎన్జీసీలో కాంట్రాక్టు డ్రైవర్ల శ్రమ దోపిడీ యథేచ్ఛగా జరుగుతోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ అన్నారు. అక్రమంగా విధుల నుంచి తొలగించిన డ్రైవర్లను తక్షణమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలోని ఓఎన్జీసీ కేజీ బేసిన్ మెయిన్ గేట్ ఎదుట కాంట్రాక్ట్ డ్రైవర్స్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్టు కారు డ్రైవర్లు సోమవారం ధర్నా చేపట్టారు.

గాజాపై దాడులు ఆపాలి

ప్రకాశం నగర్: గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను తక్షణమే ఆపాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. పశ్చిమ ఆసియాలో యుద్ధం - భారత ప్రజలపై ప్రభావం అనే అంశంపై సోమవారం రాజమహేంద్రి ఆలోచన వేదిక ఆధ్వర్యంలో ఇన్స్యూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవన్‌లో సదస్సు జరిగింది. ముఖ్య వక్తగా పాల్గొని లక్ష్మణరావు మాట్లాడుతూ రెండో ప్రపంచ యుద్ధంలో ఆయుధాల విక్రయం ద్వారా లాభపడిన అమెరికా.. ప్రపంచంపై ఆధిపత్యం చలాయించేందుకు సామ్రాజ్యవాద విధానాలను అవలంబిస్తోందన్నారు.

కోనేరు మురళికి పుత్ర వియోగం



కోనేరు సుష్మంత్ వెంకట్ (ఫైల్)

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగర ప్రముఖుడు, టీడీపీ నాయకుడు కోనేరు మురళీ కృష్ణసాయి (కోనేరు మురళి)కి పుత్రం వియోగం కలిగింది. ఆయన తనయుడు సుష్మంత వెంకట్ (26) సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. వెంకట్ భౌతిక కాయానికి పలువురు ప్రముఖులు, నాయకులు నివాళులర్పించారు. వారిలో మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు జక్కంపూడి గణేష్, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు తదితరులు ఉన్నారు. వెంకట్ అంత్యక్రియలను కోటిలింగాల కైలాస భూమిలో జరిపారు.

హెచ్‌ఎం విజయలక్ష్మి సేవలు అభినందనీయం

కడియం: మండలంలోని వెంకాయమ్మపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన విజయలక్ష్మి సేవలు అభినందనీయమని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అన్నారు. ఆమె సత్కార సభను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, ఎంఈవోలు మణికుమార్, నాగేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజాయోనాకు పురస్కారం



రాజయోనాకు పురస్కారం అందజేస్తున్న పిఠాపురం రాజవంశీకులు రాజారావు

రాజమహేంద్రవరం రూరల్: పిఠాపురం సంస్థాన రాజవంశీకులు రాజారావు వెంకట మహీపతి రామరత్నరావు బహదూర్ చేతుల మీదుగా ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజాయోనా ప్రతిష్టాత్మక ప్రతిభ పురస్కారం అందుకున్నారు. పిఠాపురంలోని కోటలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ఫిలాంత్రోఫిక్ సొసైటీ ద్వారా దేశ, విదేశాల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు చేస్తున్న సేవలను అభినందించారు.